# అమెరికాలో ప్రవాసాంధ్ర విద్యార్థి దుర్మరణం



అమెరికాలోని బర్లింగ్టన్ సిటీలో జూన్ 5న జరిగిన ఈత ప్రమాదంలో యూనివర్సిటీ ఆఫ్ వెర్మాంట్ లో పీహెచ్‌డీ చేస్తున్న ప్రవాసాంధ్ర విద్యార్థి శశిశేఖర్ కుంటా (26) దుర్మరణం పాలయ్యాడు. విజయవాడకు చెందిన శశిశేఖర్ బిట్స్ పిలానిలో మాస్టర్స్ చదువుకుని వెర్మాంట్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీకి గాను 2008లో చేరాడు.

జూన్ 5వ సాయంత్రం 7.15 గంటల సమయంలో మిత్రులతో కలిసి ఈతకు వెళ్లిన శశిశేఖర్ వినూస్కి నదిలో ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. ఫైర్ డిపార్ట్‌మెంట్ ఇతర సహాయక బృందాల ద్వారా వెతికించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే చీకటి పడిపోవడంతో ఫలితం దక్కలేదు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు బర్లింగ్టన్ బ్రిడ్జి సమీపంలో మృతదేహం కనుగొన్నారు. పోలీసు దర్యాప్తు సాగుతోంది.

తానా కార్యదర్శి మోహన్ నన్నపనేని, ఇతర తానా టీమ్ స్క్వేర్ సభ్యులు శశి మృతదేహాన్ని విజయవాడకు పంపడానికి అవసరమైన ఏర్పాట్లు చూస్తున్నారు.

తానా అధ్యక్షుడు జయరాం కోమటి, ఉపాధ్యక్షుడు ప్రసాద్ తోటకూర ఈ ప్రమాదంలో శశి మృతి పట్ల తమ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యూఎస్ వస్తున్న విద్యార్థులు అందరూ కూడా తానా వెబ్‌సైట్ ద్వారా అందిస్తున్న సూచనలను చదువుకుని జాగ్రత్తలు పాటించాలని కోరారు. కుంటా కుటుంబానికి జయరాం కోమటి తానా తరఫున తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.